క్లుప్తంగా

చురుగ్గా రామాలయ నిర్మాణం



సోమవరప్పాడులో నిర్మిస్తున్న కోదండ రామాలయం

దెందులూరు: సోమవరప్పాడు బీసీ ఏరియాలో కోదండ రామాలయంలో ఈ నెల 20న దేవతా మూర్తుల విగ్రహాలను ప్రతిష్ఠించనున్నట్టు సర్పంచ్ సరిగే నాగరాజు తెలిపారు. గ్రామంతోపాటు సమీప ప్రాంతాల భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని అన్నారు. పాత రామాలయం లోతట్టులో ఉండేదని, ఆ ప్రాంతమంతా మెరక చేసి ఆలయాన్ని పునర్నిర్మిస్తున్నట్టు తెలిపారు.

ఎరువులు, పురుగు మందు దుకాణంలో తనిఖీ

పెదపాడు: నాణ్యమైన ఎరువులు రైతులకు అందుబాటులో ఉంచాలని పెదపాడు మండల వ్యవసాయ అధికారి వానపల్లి ప్రదీప్‌కుమార్ తెలిపారు. సోమవారం పెదపాడులోని గ్రోమోర్ ఎరువుల దుకాణాన్ని ఆయన తనిఖీ చేసారు. స్టాక్ రిజిస్టర్‌ను, ఎరువుల నాణ్యతను, ఎరువుల స్టాక్‌ను పరిశీలించారు. రైతులకు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు విక్రయించాలని ఆదేశించారు. రైతుల సూచనలు సలహాలు ఫిర్యాదుల కోసం పుస్తకాన్ని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అనంతరం వారికి పలు సూచనలు చేసారు. ఈ కార్యక్రమంలో గ్రోమోర్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటింటికీ వెళ్లి పోలియో చుక్కల పంపిణీ



ఇంటికి వెళ్లి చిన్నారులకు పోలియో చుక్కలు వేసిన వైద్య, అంగన్‌వాడీ సిబ్బంది

పెదవేగి: ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికీ తల్లిదండ్రులు పోలియో చుక్కలు వేయించాలని పెదవేగి పీహెచ్‌సీ డాక్టర్ పి పూర్ణిమ తెలిపారు. పెదవేగి మండలంలోని గ్రామ, గ్రామాన ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించిన విషయం విదితమే. సోమవారం వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ సంయుక్త ఆధ్వర్యంలో పల్స్ పోలియో కేంద్రాలకు తీసుకురాని చిన్నారుల ఇళ్లకు వెళ్లి వారికి పోలియో చుక్కలు వేశారు. మండలంలో మొత్తం 6,436 మంది ఐదేళ్లలోపు చిన్నారులున్నారని వారి కోసం 78 బూత్‌లు ఏర్పాటుచేసి, 7 సూపర్‌వైజర్లతో రూట్‌లుగా విభజించి పోలియో చుక్కలు వేసినట్టు డాక్టర్ చెప్పారు.

నిధుల మంజూరు కోరుతూ వినతి

ఏలూరు(మెట్రో): సత్యవోలు - వడ్డిగూడెం రహదారి ప్రతిపాదనలు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్‌ను కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. పెదపాడు మండలం సత్యవోలు - వడ్డీగూడెం రహదారి నిర్మాణం ప్రజలు చిరకాల వాంఛ అని పద్మశ్రీ అన్నారు. ఈ రహదారిని ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన-3 పథకంలో రూ.433.69 లక్షలతో నిర్మించేందుకు పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీకి ప్రతిపాదనలు పంపించామని తెలిపారు. ఈ ప్రతిపాదనలు ఆమోదం తెలిపిన నిధులు మంజూరయ్యేలా చొరవ తీసుకోవాలని కలెక్టర్‌ను పద్మశ్రీ కోరారు.

ఈ-చలానాల రద్దు కోరుతూ వినతి

ఏలూరు (టూటౌన్): ఆటోలు, క్యాబ్‌లపై ఈ-చలానాలు రద్దు కోరుతూ ఏఐటీయూసీ బ్ల్యూఎఫ్ ఆధ్వర్యంలో ట్రాన్స్‌పోర్టు కమిషనర్, ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావులకు సోమవారం అమరావతిలో వినతి పత్రం ఇచ్చినట్టు యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ముజఫర్ అహ్మద్, జిల్లా కార్యదర్శి జె.గోపి తెలిపారు. ఏలూరు నగరంలో సీసీ కెమేరాల ద్వారా విధించిన ఈ-చలానాలు రద్దు చేయాలని, స్టాప్ లైన్, జీబ్రా లైన్ క్రమబద్ధీకరించాలని, సాంకేతిక లోపాలతో ఉన్న సిగ్నల్స్‌ను సరిచేయాలని కోరామన్నారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా నాయకులు బి.సూరిబాబు, సీహెచ్ అమర్ కుమార్ తదితరులు పాల్గొన్నట్టు తెలిపారు.

చట్టాలపై అవగాహన అవసరం

ఏలూరు (టూటౌన్): బాలికలు చట్టాలు, హక్కులపై అవగాహన పెంపొందించుకోవాలని ఐసీడీఎస్ ఏలూరు అర్బన్ ప్రాజెక్ట్ సీడీపీఓ ఎ.పద్మావతి కోరారు. ఉమెన్స్‌డే సెలబ్రేషన్స్‌లో భాగంగా స్థానిక యాదవ్‌నగర్ అంగన్‌వాడీ కేంద్ర పరిధిలోని శ్రీ సూర్య మోడల్ స్కూల్‌లో బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న పద్మావతి మాట్లాడుతూ చట్టాలు, మహిళల హక్కులు, బాల్య వివాహాలు, గుడ్‌టచ్ బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఒకటో సెక్టార్ సూపర్ వైజర్ బి.మంగ, మహిళా పోలీస్ సౌఖ్య, శ్రీ సూర్యమోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ కె.చంద్రశేఖరరావు, స్కూల్ స్టాఫ్, అంగన్‌వాడీ కార్యకర్తలు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

ప్రజల కలలను సాకారం చేసిన ప్రభుత్వం

- ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి
- పలు గ్రామాల్లో అభివృద్ధి పనుల ప్రారంభం



చల్లచింతలపూడిలో సచివాలయ ప్రారంభోత్సవం అనంతరం గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, చిత్రంలో ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్, ఘంటా ప్రసాదరావు

దెందులూరు: అన్ని రంగాలను అభివృద్ధి చేసి రాష్ట్రాన్ని ప్రగతిబాట పట్టించడంతోపాటు పేద, మధ్యతరగతి ప్రజల కలలను సాకారం చేసిన ఏకైక నాయకుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, ఏలూరు ఎంపీ కారుమూరి సునీల్ కుమార్ అన్నారు. సోమవారం అప్పారావుపాలెం, రామారావుగూడెంలో నూతనంగా నిర్మించనున్న డ్రెయిన్లకు ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి శంకుస్థాపన చేశారు. చల్లచింతలపూడిలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయాన్ని ఎమ్మెల్యే కొఠారు, ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్, వైఎస్సార్ సీపీ జిల్లా బీసీ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి పథకాలు అమలు చేయడంతోపాటు గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన, విద్య, వైద్యం, రైతు సంక్షేమం, మహిళా సంక్షేమానికి విశేషంగా కృషి చేసిన సమర్థవంతమైన నాయకుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. ఈ ఐదేళ్లలో పాలనలో అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పాలన సాగించిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని ప్రజలు మరలా ఆశీర్వదించాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడం తథ్యమన్నారు. గ్రామ గ్రామాన రైతు భరోసా కేంద్రాలు, సచివాలయాలు, హెల్త్ వెల్‌నెస్ సెంటర్లు, నాడు-నేడు పాఠశాలల అభివృద్ధి, నూతన నిర్మాణాలను చూసి ప్రతిపక్షాలు ఏం చేయాలో తెలియక గందరగోళంలో ఉన్నారన్నారు. నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు వైఎస్సార్ సీపీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలన్నారు. బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు మాట్లాడుతూ దెందులూరు ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి ఆశయాలకు అనుగుణంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కలలు కన్న గ్రామాల అభివృద్ధి, సంక్షేమానికి జిల్లా పరిషత్ నుంచి నిధులు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. జిల్లా పరిషత్ నిధుల మంజూరులో దెందులూరు నియోజకవర్గ అభివృద్ధికి తొలి ప్రాధాన్యతనిస్తున్నట్టు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడటం తథ్యమన్నారు. పార్టీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని, జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం గంగరాజు, వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీ సభ్యుడు పోకల రాంబాబు, రామారావుగూడెం సర్పంచ్ పర్వతనేని శ్రావణి సుధీర్, పార్టీ అధ్యక్షుడు పర్వతనేని వెంకట్రాజు, చల్లచింతలపూడి సర్పంచ్ బైగాని వెంకటేశ్వరమ్మ శ్రీమన్నారాయణ, ఎంపీటీసీలు తోట విజయకుమారి, తాళ్ళూరి నాగరాజు, పులిపాటి ఆనంద్, యలమర్తి బాపూజీ, సర్పంచ్‌లు యలమర్తి రేవతి రామకృష్ణ, మెండెం సంతోష్‌కుమార్, మేధినరావుపాలెం సర్పంచ్ ఎం.దుర్గాకుమారి రాజు, సొసైటీ చైర్మన్లు కొలుసు గణపతిరావు, నల్లూరి వెంకట్రామయ్య (బాబి), పాకలపాటి శ్రీనివాసరావు, తోట అచ్చియ్య, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శులు కట్టా ఏసుబాబు, చల్లా మేరిరాజు, తోతడి వేదకుమారి, సంపెంగ తిలక్, వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.అనంతరం చల్లచింతలపూడిలో పార్టీ శ్రేణులతో కలిసి ర్యాలీ నిర్వహించారు.

అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి చూపాం



కొప్పులవారిగూడెం వద్ద నూతన సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

పెదవేగి : నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి చూపామని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి అన్నారు. పెదవేగి మండలం రామసింగవరం నుంచి బాదరాల వరకు రూ.80 లక్షల నిధులతో నిర్మించిన బీటీ రోడ్డును జెడ్పీ చైర్మన్ ఘంటా పద్మశ్రీ , ఏఎంసీ చైర్మన్ అప్పన ప్రసాద్‌తో కలిసి ఆయన సోమవారం ప్రారంభించారు. అనంతరం 7వ మైలు జంక్షన్ వద్ద ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ రూ.5 లక్షల ఎంపీ లాడ్స్ నిధులతో నిర్మించిన నూతన బస్‌స్టాప్‌ను ప్రారంభించి, ప్రజలకు అంకితం చేశారు. పెదవేగి మండలం కొప్పులవారి గూడెం, నాగన్నగూడెంలో రూ.60 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్లను స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ పెనుమాల విజయ్‌బాబు, ఎంపీపీ తాతా రమ్య, ప్రజాప్రతినిధులు, పార్టీ అధ్యక్షులు పాల్గొన్నారు.

రామాదేవిని పరామర్శించిన ఎమ్మెల్యే

విజయవాడలోని మణిపాల్ హాస్పిటల్లో చికిత్స పొందుతున్న పెదవేగి మండలం అమ్మపాలెం గ్రామానికి చెందిన వీరంకి రమాదేవిని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి సోమవారం పరామర్శించారు. అనంతరం వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

నేడు ఎమ్మెల్యే కొఠారు పర్యటన వివరాలు

దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి మంగళవారం పలు అభివృద్ధి పనులను ప్రారంభించనున్నారని పెదవేగి మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు జానంపేట బాబు అన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మంగళవారం ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఉదయం 9 గంటలకు బలివే బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలిస్తారు. మధ్యాహ్నం 3 గంటలకు పెదవేగి మండలం రాయన్నపాలెం పాతురు గౌడ బజారులో నూతనంగా నిర్మించిన గౌడ సంఘం కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభిస్తారు. అనంతరం మధ్యాహ్నం 3:30 గంటలకు రాయన్న పాలెం సెంటర్‌లో వైఎస్సార్ హెల్త్ క్లినిక్ ను ప్రారంభించి, సాయంత్రం 4 గంటలకు చింతలపాటివారిగూడెంలో నూతన గోడౌన్‌ను ప్రారంభిస్తారు. అనంతరం పలువురు లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేస్తారు. ప్రజాప్రతినిధులు, పార్టీ అధ్యక్షులు, సొసైటీ అధ్యక్షులు, సచివాలయ కన్వీనర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని జానంపేట బాబు కోరారు.

1,671 మందికి నేడు ఇళ్ల పట్టాల పంపిణీ

ఉంగుటూరు: ఉంగుటూరు మండలంలో 1,671 మందికి ఇళ్ల పట్టాలు ఉంగుటూరు పాతూరి శివన్నారాయణ కమ్మ కల్యాణ మండపంలో మంగళవారం ఉదయం 9 గంటలకు మంగళవారం ఎమ్మెల్యే పుప్పాలవాసు బాబు చేతులు మీదుగా పంపిణీ చేస్తామని తహసీల్దారు వెంకట శివయ్య తెలిపారు. లబ్ధిదారులు అందరికీ రిజిస్ట్రేషన్ల పట్టాలు సిద్ధమైనట్టు తెలిపారు. 24 గ్రామ సచివాలయాల పరిధిలో లబ్ధిదారులకు వాటిని పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. మండలంలోని లబ్ధిదారులు, ఆయాగ్రామల ప్రజాప్రతినిధులు, అధికార్లు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని తహసీల్దారు కోరారు.

నేడు ఎమ్మెల్యేతో కొల్లేరు పెద్దల సమావేశం

ఏలూరు రూరల్: ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరితో కొల్లేరు గ్రామాల పెద్దలు మంగళవారం సమావేశం కానున్నట్టు వైఎస్సార్ సీపీ ఏలూరు రూరల్ మండల అధ్యక్షుడు తేరా ఆనంద్ తెలిపారు. ఉదయం 11 గంటలకు కొండలరావుపాలెంలో నిర్వహించే ఈ సమావేశానికి పైడిచింతపాడు, ప్రత్తికోళ్లలంక, కొక్కిరాయిలంక, గుడివాకలంక గ్రామాల సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, పార్టీ నాయకులు, గ్రామదక్షులు, సచివాలయ కన్వీనర్లు హాజరౌతారని పేర్కొన్నారు.

రామ్మోహనరావు సేవలు మరువలేనివి

భీమడోలు: రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు, దివంగత అల్వా రామ్మోహనరావు సేవలు మరవలేనివని పలువురు వక్తలు అన్నారు. భీమడోలుకు చెందిన అల్వా రామ్మోహనరావు ప్రథమ వర్ధంతిని పురస్కరించుకుని సోమవారం ఆయన ఇంటి వద్ద సంతాప సభ నిర్వహించారు. రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడిగా అల్వా రామ్మోహనరావు అందించిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు పి.సత్యనారాయణ, గుల్ల నూకరాజు, వైఆర్‌కే శర్మ, పాలేటి బ్రహ్మరావు, ఉన్నమట్ల సత్యనారాయణ, అల్లాడ ప్రసాదరావు, రామిశెట్టి గంగాధరరావు పాల్గొన్నారు.

కొమిరేపల్లి గ్రామస్తుల కల సాకారం



నాడు : కొమిరేపల్లి రోడ్డు



నేడు : రూ. 88 లక్షలతో నిర్మిస్తున్న కొమిరేపల్లి రోడ్డు

దెందులూరు: కొమిరేపల్లి గ్రామస్తుల మూడు దశాబ్దాల నాటి కల ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి చొరవతో నెరవేరింది. ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి కొమరేపల్లి గ్రామస్తులు పడుతున్న ఇబ్బందులను గుర్తించి జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీని కలిసి వివరించారు. వెంటనే స్పందించిన జెడ్పీ చైర్‌పర్సన్ రూ.88 లక్షలు నిధులు మంజూరు చేశారు.దీంతో బీటీ రోడ్డు నిర్మాణ పనులు వేగవంతమయ్యాయి. రోడ్డు కోసం 30 ఏళ్లుగా తిరగని ప్రభుత్వ కార్యాలయం లేదు... కలవని ప్రజాప్రతినిధి లేరని గ్రామస్తులు అన్నారు. సోమవారం జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం గంగరాజు, మండల పార్టీ అధ్యక్షుడు కామిరెడ్డి నాని, సర్పంచ్ పరసా లక్ష్మీ సుజాత, సొసైటీ చైర్మన్ నల్లూరి వెంకట్రామయ్య (బాబి), వైఎస్సార్ సీపీ కొమిరేపల్లి గ్రామ నాయకులు ఆనపా శ్రీను, ఎంపీటీసీ పులవర్తి వరమణి, పార్టీ నాయకులు యోహాను, పులవర్తి సంతోష్, దిలీప్, బాలకృష్ణ తదితరులు రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. జిల్లాలో ఎక్కడా లేని విధంగా 35 ఏళ్ల ఇబ్బందిని తొలగించిన ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి దెందులూరు నియోజకవర్గంలో రెండోసారి ఎమ్మెల్యేగా విజయం సాధించడం తథ్యమని కొమిరేపల్లి వైఎస్సార్ సీపీ నాయకులు అన్నారు.

వైభవంగా ఆలయ ధ్వజ స్తంభ ప్రతిష్ఠ మహోత్సవం



పూళ్లలో ముస్తాబైన కల్యాణ వేంకటేశ్వర స్వామి



ఆలయంలో భారీ ధ్వజ స్తంభాన్ని ప్రతిష్ఠిస్తున్న దృశ్యం

భీమడోలు: పవిత్ర గోదావరి కాలువ గట్టున పూళ్లలో వేంచేసియున్న శ్రీదేవి, భూదేవి, నీళాదేవి సీతశ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో వార్షిక కల్యాణోత్సవాల్లో భాగంగా రెండో రోజైన సోమవారం నూతన ధ్వజ స్తంభ ప్రతిష్ఠ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు, ఎన్ఆర్ఐలు మద్దుల సూర్యనారాయణ, వెంకటలక్ష్మీ ప్రభావతి ఆర్థిక సాయంతో 27వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సహిత జీర్ణోద్ధరణ, నూతన ధ్వజ స్తంభం ప్రతిష్ఠ కార్యక్రమాలు కన్నుల పండువగా నిర్వహించారు. ఆలయంలోని స్వామి, అమ్మవార్లను విశేషంగా అలంకరించారు. ఏటా ఆలయంలో వార్షిక కల్యాణోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఆలయ ప్రధానాచార్యులు కొడవర్తి వీర రాఘవాచార్యులు ఆధ్వర్యంలో వరంగల్‌కు చెందిన వేద పండితుల బృందం విశేష క్రతువు పూజలను చేసారు. ఏన్నో ఏళ్లుగా జీర్ణోద్ధరణ చెందిన ఆలయ ధ్వజ స్తంభాన్ని ఎన్ఆర్ఐ దంపతులు రూ.లక్షలతో ఏర్పాటు చేశారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేసారు. క్రేన్ ధ్వజ స్తంభాన్ని ప్రతిష్ఠించారు. గోవిందనామ స్మరణతో ఆలయ ప్రాంగణమంతా మార్మోగింది. ఈనెల 5న చక్రస్నానం, 6న భారీ అన్న సమారాధన నిర్వహించనున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు.

వేంకటేశ్వర ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్‌పర్సన్‌గా మీనాకుమారి



భీమడోలు: గుండుగొలనులోని వేంకటేశ్వర స్వామి ఆలయ ట్రస్ట్ బోర్డు కమిటీ చైర్‌పర్సన్‌గా వగ్వాల మీనాకుమారి అచ్యుతరామారావు నియమితులయ్యారు. ఈనెల 5వ తేదీ మంగళవారం ఉదయం 10 గంటలకు ఆలయ ట్రస్ట్ బోర్డు కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేస్తారు. నూతన కమిటీలో ఇద్దరు ఓసీలు, నలుగురు బీసీలు, ఒక ఎస్సీ, ఒక అర్చకున్ని నియమిస్తూ దేవదాయ ధర్మదాయ శాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేసారు. ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్‌పర్సన్ వగ్వాల మీనాకుమారి రెండోసారి ఎన్నికయ్యారు. ఆలయ ట్రస్ట్ బోర్డుకు దండు లక్ష్మీపతిరాజు, తుమ్మలపూడి గంగాభవానీ, గుల్లిపల్లి అన్నపూర్ణ, నేరెడుపల్లి సింహాచలం, నాగం సోమరాజు, నిట్టా వెంకట నరసింహులు, ఎం.రామానుజం మంగపతి ఆచార్యులను ప్రభుత్వం నియమించింది. నూతన కమిటీ సభ్యుల నియామకంలో ప్రత్యేక శ్రద్ధ వహించిన ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబుకు వైఎస్సార్‌సీపీ జిల్లా నాయకులు వగ్వాల అచ్యుతరామారావు కృతజ్ఞతలు తెలిపారు. నూతన కమిటీ సభ్యులను నాయకులు అభినందించారు.

నేడు లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేత

భీమడోలు ఎంపీపీ సమావేశ మందిరంలో మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించనున్న కార్యక్రమంలో ఇళ్ల స్థలాల లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాలను ఎమ్మెల్యే వాసుబాబు అందజేస్తారని మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వరరావు సోమవారం తెలిపారు. గుండుగొలను, భీమడోలు గ్రామాల్లో నిర్వహించనున్న కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు విధిగా పాల్గొనాలని వారు కోరారు.

సంగీత సేవ అభినందనీయం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఎస్‌పీఎస్ మ్యూజిక్ అకాడమీ ప్రారంభించి 22 ఏళ్లుగా ఎస్‌పీఎస్ వాసు సంగీత రంగానికి చేస్తోన్న సేవ అభినందనీయమని పలువురు అతిథులు పేర్కొన్నారు. నగరానికి చెందిన ఎస్‌పీఎస్ మ్యూజిక్ అకాడమీ 22వ వార్షికోత్సవాన్ని ఆదివారం స్థానిక రామకృష్ణాపురంలోని సాహిత్య మండలిలో వైభవంగా నిర్వహించారు. అతిథులు మాట్లాడుతూ వాసు ఏలూరు పరిసర ప్రాంతాలకు చెందిన ఎంతోమందికి సంగీత రంగంలో ఉపాధి కల్పించడం కోసం నగరంలో రికార్డింగ్ థియేటర్‌ను నెలకొల్పి ప్రతిభావంతులను ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. సంస్థ వార్షికోత్సవం సందర్భంగా వివిధ రంగాల్లో అత్యున్నత సేవలు అందించిన ఆలపాటి నాగేశ్వరరావుకు కళాపోషకరత్న, పెదపాటి రామకృష్ణకు కళాసేవక రత్న, ఎస్‌వీ గంగాభవానికి కళా సరస్వతి అవార్డులు ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్‌పీఎస్ మ్యూజిక్ అకాడమీ విద్యార్థులు నిర్వహించిన సంగీత కార్యక్రమం ఆకట్టుకుంది. ఎస్‌పీఎస్ వాసు, వహిదా వాసు నిర్వహణలో జరిగిన ఈ కార్యక్రమంలో ఏపీ కల్చరల్ డైరెక్టర్ రేగుళ్ల మల్లికార్జునరావు, తెలుగు రచయితల సంఘం జిల్లా అధ్యక్షుడు లంకా వెంకటేశ్వర్లు, హిందూ యువజన సంఘం ప్రధాన కార్యదర్శి కేవీ సత్యనారాయణ, డీఆర్‌డీఏ పీడీ ఆర్ విజయ రాజు పాల్గొన్నారు.

ప్రతిభ గల విద్యార్థులకు నగదు పురస్కారం



పూళ్లలో ప్రతిభ గల విద్యార్థులకు నగదు పురస్కారాలను అందించిన ఎన్ఆర్ఐ దాతలు

భీమడోలు: పూళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలోని ప్రతిభ గల పేద విద్యార్థులకు దాతలు నగదు పురస్కారాన్ని అందించి ప్రోత్సహించారు. పాఠశాలలో సోమవారం హెచ్‌ఎం పెనుగొండ భువనేశ్వరరావు అధ్యక్షతన ప్రత్యేక కార్యక్రమం జరిగింది. ఆరు నుంచి పదో తరగతి వరకూ ప్రతిభను చాటుతున్న పది మంది విద్యార్థినీ విద్యార్థులకు అమెరికాలోని న్యూజెర్సీకు చెందిన పూళ్ల వాస్తవ్యులు ఎన్ఆర్ఐ దంపతులు మద్దుల సూర్యనారాయణ, ప్రభావతి, మద్దుల వెంకటేశ్వరరావు, లక్ష్మీకుమారి దంపతులు నగదు ప్రోత్సాహం అందించారు. ఒకొక్క విద్యార్థికి రూ.5వేల చొప్పున రూ.50వేలు ఆర్థిక సాయాన్ని అందించి తమ దాతృత్వాన్ని చాటారు. పేద విద్యార్థులను ఆదుకునేందుకు ప్రభుత్వ సాయానికి తోడు దాతలు తమ సహాయ సహకారాలను అందించాలని వారు కోరారు. ప్రతి ఒక్క విద్యార్థిని అభినందించారు. ఉన్నత స్థితికి చేరుకునేందుకు చదువే ఆయుధమన్నారు. తమ బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని వారికి హితవు పలికారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కిలపర్తి వెంకటేష్, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

పంట నమోదు.. రైతుల పాలిట వరం



భీమడోలులో పంట నమోదు జాబితాలను ప్రదర్శిస్తున్న ఆర్‌బీకే అధికారులు, సిబ్బంది

భీమడోలు: రబీ సీజన్‌లో పంట నమోదు ప్రక్రియ రైతుల పాలిట వరమని, దీని ద్వారా అర్హులందరికీ బహుళ ప్రయోజనాలు చేకూరుతాయని మండల ఏవో డాక్టర్ ఎస్‌పీవీ ఉషారాణి అన్నారు. పంట నమోదు ముగిసినందున మండలంలోని 14 ఆర్‌బీకే వద్ద సోమవారం సామాజిక తనిఖీ జాబితాలను విడుదల చేసారు. రైతు భరోసా కేంద్రాల వద్ద గ్రామ సభలను నిర్వహించారు. భీమడోలు-1 సచివాలయం వద్ద వీఆర్వోలు సాల్మన్‌రాజు, వినయ్, వీఏఏలు రామలక్ష్మీ, రూపలు రైతులతో కలిసి జాబితాలను ప్రదర్శించారు. పూళ్లలో సర్పంచ్ దాయం సుజాత పాల్గొని పంట నమోదు వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. ఏవో ఎస్‌పీవీ ఉషారాణి మాట్లాడుతూ రైతులు పంట నమోదు జాబితాలను పరిశీలించుకుని, అభ్యంతరాలుంటే సంబంధిత వీఏఏలకు సమాచారం అందించాలన్నారు. అభ్యంతరాలు ఉంటే తెలియజేసి తమ సమస్యను పరిష్కరించుకోవాలన్నారు. మండల వ్యాప్తంగా 4,498 రైతులు 13,160 ఎకరాల్లో రబీ సీజన్‌లో సాగు చేస్తున్నారన్నారు.

సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారం



బ్రహ్మనందపురంలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఉంగుటూరు: మండలంలోని కైకరం శివారు, వెంకటకృష్ణాపురం, బ్రహ్మనందపురంలో వైఎస్సార్ సీపీ నాయకులు సోమవారం ఇంటింటికీ వెళ్లి సీఎం జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలంపై విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పార్టీ పంచాయతీరాజ్ జిల్లా అధ్యక్షుడు పుప్పాల గోపి మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్న వాసుబాబును రాబోయే ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కొరిపల్లి జయలక్ష్మి, ఎంపీటీసీ పంతులు వెంకన్న, ఏలూరు జిల్లా క్రిస్టియన్ మైనారిటీ సెల్ జాయింటు సెక్రటరీ అనిల్ కుమార్, ఉపసర్పంచి మట్టాముర‌ళి, వార్డు సభ్యులు భలే ఏడుకొండలు, నత్త వెంకటేశ్వరరావు, దేవాదినం, నాయకులు గంజి ప్రభాకరరావు, వై.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కమ్ముకున్న పొగ మంచు



రెందులూరులో రోడ్డు, వరి పొలంపై దట్టంగా కమ్మిన పొగ మంచు

కొన్ని రోజులుగా పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. రాత్రి వేళలో చలి, పొగమంచు ఇంకా తగ్గుముఖం పట్టలేదు. ఉదయం 9 గంటలకు కూడా వాతావరణంలో దట్టమైన పొగమంచు వీడటం లేదు. ముఖ్యంగా జాతీయ రహదారి, గ్రామీణ ప్రాంతాల్లోని రోడ్లపై పొగమంచు తెరలు కమ్మేయడంతో ఉదయం వేళ ప్రయాణించే ద్విచక్ర వాహనదారుల లైట్లు వేసుకుని వెళ్లాల్సి వస్తోంది. పొగ మంచు కారణంగా వ్యవసాయ పనులకు ఆటంకం కలుగుతోందని రైతులు, కూలీలు అంటున్నారు. - దెందులూరు